క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం రూరల్: రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా శ్యామ్యూల్ దివాకర్, జిల్లా వీఆర్వోల సంఘ అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్, సహ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్ తదితరులు పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా ఎరువులు వాడొద్దు

ముమ్మిడివరం: విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల పంట దిగుబడులు తగ్గిపోతాయని మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు ఎరువులు, పురుగు మందుల వాడకంపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం మేరకు మాత్రమే ఎరువులు వినియోగించడం వల్ల ఖర్చు ఆదా కావడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. మిత్ర పురుగుల సంరక్షణకు ప్రతి వారం వరి చేలను పరిశీలించాలని రైతులకు సూచించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం: ప్రస్తుతం ప్రజలు సీజనల్ వ్యాధులతో పాటు జ్వరాల బారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కొత్తలంక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ కోలా గంగా భవాని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గ్రామాల్లోని జ్వర పీడితులను గుర్తించి వైద్య సేవలందించాలన్నారు.

ఘనంగా కలశ పూజ



రామేశ్వరస్వామి ఆలయంలో కలశ పూజ చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: గున్నేపల్లి అగ్రహారంలో వేంచేసి ఉన్న పార్వతీ రామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అష్టోత్తర కలశ పూజ వైభవంగా జరిగింది. ఈ పూజలను చంద్రమౌళి సూర్యసుబ్రహ్మణ్యం శర్మ, యలమించిలి సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్నాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రమాద బీమా అందజేత



మృతుడి భార్యకు బీమా చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

తాళ్లరేవు: కుటుంబ యజమాని ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాళ్లరేవు శాఖ ప్రమాద బీమా సొమ్ము అందించింది. ఆ వివరాల్లోకి వెళితే.. తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ బొడ్డువానిలంక గ్రామానికి చెందిన జిత్తుగ పెదఅప్పారావు(46) గత ఏడాది నవంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అంతకు ముందు స్థానిక బ్రాంచ్‌లో స్టేట్ బ్యాంక్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో భాగంగా రూ.వెయ్యి చెల్లించేవారు. ఈ నేపథ్యంలో బీమా మొత్తం రూ.20 లక్షల చెక్కును మృతుని భార్య సత్యవేణికి ఎస్‌బీఐ అధికారులు అందజేశారు. ఎస్‌బీఐ మేనేజర్ పి.సూజన్, రీజినల్ మేనేజర్ ఎస్.గుణేశ్వరరావు, ఆర్‌బీఓకే కృష్ణమోహన్, ఎస్‌బీఐ అధికారులు కృష్ణబాలాజీ, యానిమేటర్ ఈశ్వరీబాయి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అంబాజీపేట: ప్రమాదవశాత్తూ స్టౌ నుంచి మంటలు చెలరేగి తీవ్రంగా గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీనికి సంబంధించి అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొండవరం ముహూర్తాల చెరువుగట్టు వద్ద ఉన్న పుట్టింటి వద్ద కముజు వాణి(బాలింత) (25) ఉంటోంది. గత ఏడాది డిసెంబర్ 15వ తేదీ సాయంత్రం ఇంటి వద్ద పాలు వేడిచేస్తుండగా స్టౌ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి వాణికి నిప్పంటుకుందన్నారు. దాంతో క్షతగాత్రురాలిని అమలాపురం కిమ్స్‌కు తరలించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రిలో తరలించారు. ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారన్నారు. మృతురాలి తల్లి మట్టపర్తి ఉమా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు.

నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం

- పలుచోట్ల రహదారి భద్రతా వారోత్సవాలు



అమలాపురంలో అవగాహన ర్యాలీ చేస్తున్న సీఐ కొండలరావు తదితరులు

అమలాపురం టౌన్: రోడ్డు నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దామని అమలాపురం పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా ఆయన ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులతో పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన నినాదాలతో కూడిన ప్లకార్డులను విద్యార్థులు చేతబూని ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

భద్రతే అందరి బాధ్యత

అల్లవరం: ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు బాధ్యతగా మెలిగి ప్రమాదాలను నివారించాలని ఎస్సై శ్రీను నాయక్ పిలుపునిచ్చారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, 18 ఏళ్లు నిండిన వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, సీబుక్ ఉండాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. తనిఖీల సమయాల్లో వాహన పత్రాలను చూపించి పోలీసు వారికి సహకరించాలని ఎస్సై తెలిపారు.

అమలాపురం రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి అశోక్ ప్రతాప్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్, సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రహదారి భద్రత పట్ల పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదన్నారు. రావులపాలెం మండలం ఈతకోటలో టోల్‌ప్లాజా వద్ద ఎంఈఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనదారులు, స్కూల్ విద్యార్థులకు గులాబీలు అందించి అవగాహన కల్పించారు. కాశీవిశ్వేశ్వరరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఆటో డ్రైవర్లు అప్రమత్తతతో వాహనాలను నడపాలని ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు. ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్‌లో యల్లమిల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎప్పుడైనా ప్రమాదాలు సంభవిస్తే వెంటనే 108కు ఫోన్ చేసి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలన్నారు. హెచ్‌సీ బి.భైరవస్వామి, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఓడలరేవులో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీను నాయక్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఉప్పంగలలో పథకాలను వివరిస్తూ కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉప్పంగల పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ శాఖా శంకరుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ దవులూరి శ్రీరామ్మూర్తి తదితరులతో కలసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మూడున్నరేళ్లలో ప్రజలకు అందిన లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ పథకాలు చేరుతున్నాయన్నారు. అర్హులందరికీ మేలు జరుగుతుందన్నారు. ఎంపీపీ రాయుడు సునీత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, నాయకులు కొపనాతి నాగరాజు, కాశి లక్ష్మణస్వామి, పెట్ల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫల, పుష్ప ప్రదర్శనకు స్థల పరిశీలన



బొటానికల్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఫ్లవర్ షో కమిటీ సభ్యులు, ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెలలో ఫల, పుష్ప ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. శుక్రవారం ఫ్లవర్ షో నిర్వహణకు సంబంధించి స్థానిక బొటానికల్ గార్డెన్స్‌లో స్థలాన్ని వ్యవసాయ శాఖ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ గణేషన్, వ్యవసాయాధికారి జోగిరాజు మాట్లాడుతూ ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వం ఫ్లవర్ షో నిర్వహణకు సంబంధించి బడ్జెట్ అప్రూవల్ ఇచ్చిందన్నారు. బొటానికల్ గార్డెన్‌లో ఫిబ్రవరి 17, 18, 19 తేదీల్లో నిర్వహించాలని భావిస్తున్నారని తెలిపారు. ఇంకా ఆలస్యమైతే వాతావరణ మార్పు, వేసవితాపం వల్ల పుష్పాలు వాడిపోతాయన్నారు. ఈ నేపథ్యంలో తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

బ్యాంక్ ఖాతాల నుంచి నగదు మాయం

అమలాపురం టౌన్: ఇటీవల కాలంలో ఖాతాదారులకు తెలియకుండానే వారి సేవింగ్ అకౌంట్స్ నుంచి నగదు మాయం అవుతోంది. వీటిపై సంబంధిత బ్యాంకుల అధికారులు బాధితుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులు తీసుకుని వాటిని సైబర్ నేర విభాగానికి పంపిస్తున్నారు. అమలాపురం బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో పరసా వెంకట నారాయణస్వామికి సేవింగ్స్ అకౌంట్ ఉంది. ఆ అకౌంట్ నుంచి గురువారం రాత్రి 9.26 గంటలకు రూ.10 వేలు డ్రా అయింది. వెంటనే చూసుకున్న నారాయణస్వామి ఉదయమే బ్యాంక్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలనుకున్నాడు. శుక్రవారం ఉదయమే బ్యాంక్‌కు వెళ్తున్న సమయంలో మరో రూ.10 వేలు విత్ డ్రా అయినట్లు తన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఈ మేరకు బ్యాంక్ మేనేజర్‌కు ఆధారాలు చూపించారు. ఈ మధ్య మీరు ఎక్కడైనా తంబ్ (వేలి ముద్ర) వేశారా..? అని ఆ ఖాతాదారుడిని మేనేజర్ అడిగారు. 20 రోజుల కిందట ఓ ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం తంబ్ వేశానని బదులిచ్చాడు. ఇదిలా ఉంటే ఇదే బ్యాంక్‌లో మరో ఖాతాదారుడు కూడా రూ.పది వేలు మాయమైనట్లు ఫిర్యాదు చేశాడు. అంబాజీపేటకు చెందిన ఓ వ్యాపారి ఖాతా నుంచి ఇటీవల రూ.10 వేలు మాయం అయ్యాయి. ఆరు నెలల కిందట అయితే పి.గన్నవరం మండలానికి చెందిన ఆరుగురు ఖాతాదారుల నుంచి ఇలాగే రూ.వేలల్లో నగదు మాయమైన ఫిర్యాదులు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు.

అప్పనపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మహర్దశ

- రూ.12 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం



అప్పనపల్లిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునీకరణ పనులు

మామిడికుదురు: ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న అప్పనపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మహర్దశ పట్టింది. ప్రస్తుతం ఉన్న బ్లాక్‌టాప్ రోడ్డు స్థానే పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు (సీసీ) రోడ్డు నిర్మిస్తున్నారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని 12 అంగుళాల ఎత్తు పెంచి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గత నెలలో చేపట్టిన ఈ రోడ్డు ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాశర్లపూడి నుంచి అప్పనపల్లి వరకు రూ.12 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునీకరణలో భాగంగా ఏటా ఒక మాదిరి గోదావరి వరదకే ముంపు బారినపడుతున్న అప్పనపల్లి కాజ్‌వే ఎత్తును కూడా గణనీయంగా పెంచనున్నారు. ముంపు నుంచి విముక్తి కలిగించే విధంగా రూ.4 కోట్లతో కాజ్‌వే నిర్మిస్తారు. మరో రూ.8 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. 18 అడుగుల వెడల్పు, ఐదడుగుల అప్రోచ్ రోడ్డుతో సహా 23 అడుగుల వెడల్పుతో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించి, రోడ్డును వెడల్పు చేశారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఎంతో కాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చొరవతో నిధులు మంజూరయ్యాయి. అప్పనపల్లి మలుపు నుంచి పెదపట్నంలంక వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డులో కొంత మేర సీసీ రోడ్డు నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టారు. గోదావరి వరదలకు దెబ్బతిన్న ఈ రోడ్డుకు ఇప్పటికే రూ.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తైన తర్వాత మిగిలిన రోడ్ల అభివృద్ధి పనులు చేపడతామని ఆర్‌అండ్‌బీ ఏఈ సత్యనారాయణ 'సాక్షి'కి తెలిపారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అల్లవరం: ఆధార్‌లో తప్పుల సవరణ, పదేళ్ల కిందట కార్డు తీసుకుని అప్‌డేట్ చేసుకోని వారి కోసం ఎంపిక చేసిన సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరోవరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21, 23వ తేదీల్లో మొగళ్లమూరు, ఎస్.పల్లిపాలెం, 23, 24న ఓడలరేవు, 24న గోడితిప్ప, ఫిబ్రవరి 7, 8న తుమ్మలపల్లి, ఎంట్రుకోన, 9, 10 తేదీల్లో గూడాల, కొమరగిరిపట్నం-1 సచివాలయాల్లో శిబిరాలు ఉంటాయన్నారు. ఈ శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొత్త పింఛన్లు మంజూరు

యానాం: నియోజకవర్గానికి కొత్తగా వృద్ధాప్య, వితంతు పింఛన్లు మంజూరు చేస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై ఆదేశాలు జారీ చేశారని శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్‌లకు కొత్తగా 16,769 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. యానాంలో మొత్తం 529 మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేశారని, వీరందరికీ త్వరలోనే వస్తాయన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



అనూష్‌బాబును సత్కరించిన ఎంపీపీ మిరియాం జ్యోతి, సిబ్బంది

ఐ.పోలవరం: న్యూఢిల్లీలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చర్ అండ్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పశువుల్లంక గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.అనూష్‌బాబు సిల్వర్ మెడల్ సాధించారు. శుక్రవారం అతన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు మోర్త మిరియాం జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి, మండల ఇంజినీరింగ్ అధికారి సీహెచ్ రవి, జేఈ చక్రధరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొని అనూష్‌బాబును అభినందించారు.

వైభవంగా గ్రామ దేవతల జాతర



చల్లపల్లిలో మహిషాసుర మర్దిని అమ్మవారు

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామ దేవతలు మహిషాసుర మర్దిని, కనక మహాలక్ష్మి అమ్మవార్ల జాతరలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై గ్రామ దేవతలను దర్శించుకున్నారు.

ఘనంగా హరిహరులకు పూజలు

కొత్తపేట: నూతన సంవత్సరంలో తొలి మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని స్థానిక హరిహర దేవాలయం ప్రాంగణంలో వివిధ ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. మాసశివరాత్రి కమిటీ కన్వీనర్ కీర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు కొంపెల్ల వెంకటేశ్వరశర్మ, కీర్తి మూర్తి తదితరుల ఆధ్వర్యంలో అర్చకులు, భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రాంగణంలో వేంచేసిన రాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీదేవికి సామూహిక కుంకుమ పూజలు, శ్రీ, భూ సహిత వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, లక్ష తులసి పూజలు నిర్వహించారు.

బాలుడి వైద్యానికి జగ్గిరెడ్డి సాయం



సత్యసాగర్ తల్లికి రూ.30 వేల సాయం అందిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

అమలాపురం టౌన్: సంక్రాంతి వేడుకల్లో ఓ ఆలయ భవనం నుంచి ఆర్కెస్ట్రా తిలకిస్తున్న బాలుడు సత్యసాగర్ (12) ప్రమాదవశాత్తు కిందపడి ముఖానికి తీవ్ర గాయమైంది. అమలాపురం సాయి సంజీవిని ఆసుపత్రిలో అతను చికిత్స పొందుతున్నాడు. కొత్తపేటలో పేద కుటుంబానికి చెందిన సత్యసాగర్‌కు ఈ ఆసుపత్రిలో అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. బాధితుడిని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. సత్యసాగర్ వైద్యానికి తన వంతు సాయంగా జగ్గిరెడ్డి రూ.30 వేలు అందించారు. సంక్రాంతి రోజున సాయి సంజీవిని ఆసుపత్రి వైద్య దంపతులు డాక్టర్ పవన్‌కుమార్, సాయిశిల్ప దాదాపు 6 గంటల పాటు శ్రమించి సత్యసాగర్‌కు శస్త్రచికిత్స చేశారు. అతని ముఖంలో రాళ్లు, ఇసుక, ఊచలు దిగబడి పోయిన క్రమంలో అత్యవసర శస్త్రచికిత్స చేసిన ఆ వైద్యులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సత్కరించారు. అలాగే అమలాపురానికి చెందిన శెట్టిబలిజ యువజన సంఘ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజుతో కూడిన అమలాపురం యువకులు వైద్య దంపతులను అభినందించారు. అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

యానాం విద్యార్థిని ప్రతిభ



తృతీయ బహుమతి అందుకుంటున్న ప్రశాంతి

యానాం: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకూ ఇండియన్ సొసైటీ ఆఫ్ యానిమల్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌ఏపీఎమ్) నిర్వహణలో జాతీయ స్థాయిలో 'ఫ్యూచిరిస్టిక్ అప్రోచ్ టు వియబుల్ యానిమల్ ప్రొడక్షన్ విషియస్ క్లైమేట్ అండ్ కలామిటీ చాలెంజెస్' అనే అంశంపై కాన్ఫరెన్స్ జరిగింది. ఇందులో యానాంకు చెందిన కమిడి ప్రశాంతి ఆల్‌ఇండియా స్థాయిలో మూడో స్థానం సాధించింది. మాస్టర్ ఇన్ వెటర్నరీ సైన్స్ (ఎమ్‌వీఎస్‌సీ) పూర్తి చేసుకున్న ప్రశాంతి యానాంలోని పశువులు, పశుగణాభివృద్ధి తదితర అంశాలపై పరిశోధన చేసి ఆ పత్రాన్ని శనివారం జరిగిన కాన్ఫరెన్స్‌లో సమర్పించారు. ప్రశాంతి తండ్రి కమిడి చిట్టిబాబు యానాం ఆర్ఏఓ ఆఫీసులో అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆల్‌ఇండియా స్థాయిలో మూడో స్థానంతో పాటు సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకున్న ప్రశాంతిని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తదితరులు అభినందించారు.

కదలాడిన కుంచె.. మధురానుభూతి మిగిల్చే



లైవ్ పెయింటింగ్ వర్క్‌షాపులో చిత్రాన్ని గీస్తున్న ఓ చిత్రకారుడు

అమలాపురం టౌన్: కళ్లెదుటే కాన్వాస్‌పై చిత్రకారులు తమ కుంచెతో సృజనాత్మక చిత్రాలు వేస్తున్న దృశ్యాలను చూడడం ఓ మధురానుభూతి. స్థానిక ఏలీమ్ కళాశాల ప్రాంగణంలో పీసీ ప్రసాద్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో జరుగుతున్న లైవ్ పెయింటింగ్ వర్క్‌షాపు రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు ఈ వర్క్‌షాపులో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. దాదాపు 15 మంది చిత్రకారులు చిత్రాలు గీస్తున్నప్పుడు చిత్రకళాభిమానులు కన్ను ఆర్పకుండా ఆసక్తిగా తిలకించారు. ఆర్ట్ గ్యాలరీ వ్యవస్థాపకుడు, చిత్రకారుడు పీసీ ప్రసాద్ తన గ్యాలరీ తొలి వార్షికోత్సవం సందర్భంగా ఈ వర్క్‌షాపును ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వర్క్‌షాపు శనివారం కూడా కొనసాగుతుందని ప్రసాద్ తెలిపారు. సాయంత్రం ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

కోరంగి అభయారణ్యంలో 'కొమ్మినేని'



కోరంగి అభయారణ్యంలో బోటు షికారు చేస్తున్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరావు

తాళ్లరేవు: సీనియర్ పాత్రికేయుడు, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం కోరంగి అభయారణ్యంలో పర్యటించారు. జిల్లా ఫారెస్ట్ అధికారి ఐకేవీ రాజు, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాదరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.నాగార్జున తదితరులు కొమ్మినేనికి ఘన స్వాగతం పలికారు. మడ అడవుల్లోని అందాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. చెక్కల వంతెనపై నడుస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. అనంతరం స్థానిక గోదావరి పాయలో అధికారులతో కలసి బోటు షికారు చేశారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ కోరంగి మడ అటవీ ప్రాంతం విదేశాల్లోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను తలదన్నేలా ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రకృతి రమణీయ దృశ్యాలు, అరుదైన వృక్ష, పక్షిజాతులు ఆకట్టుకుంటున్నాయని అన్నారు. పక్షుల కిలకిలా రావాలు, సాగర సంగమం, చెక్కల వంతెనపై ప్రయాణం మరిచిపోలేని అనుభూతిని ఇస్తున్నాయన్నారు. ఇక్కడి అద్భుతమైన అందాలు ఇతర ప్రాంతాల వారికి తెలిసే విధంగా మీడియా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీ బాలగంగాధర్ తిలక్, ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు తదితరులు ఉన్నారు.

ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి



అమలాపురంలో వాకథాన్ నిర్వహిస్తున్న వాకర్స్

అమలాపురం టౌన్: వాకర్స్ అంతర్జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ఆళ్వార్‌దాస్ వర్ధంతి సందర్భంగా స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు యునైటెడ్ నర్సింగ్ హోమ్ నుంచి పుర వీధుల్లో శుక్రవారం ఉదయం వాక్ థాన్ నిర్వహించారు. అనంతరం స్థానిక మున్సిపల్ పార్కులో సందర్శకులకు నడకపై అవగాహన కల్పించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా నాగేశ్వరరావు, కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్, కోశాధికారి గోటేటి గంగాధరరావు, అంతర్జాతీయ వాకర్స్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, వాకర్స్ ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణ రెడ్డి, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ఆళ్వార్‌దాస్ వర్ధంతి సందర్భంగా అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బండార్లంకలో పేదలకు అన్నదానం జరిగింది. క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, కార్యదర్శి యర్రమిల్లి అనంతలక్ష్మి, కోశాధికారి పోలిశెట్టి నాగమానస, ఉపాధ్యక్షురాలు భమిడిపాటి పద్మావతి, జిల్లా చైర్‌పర్సన్ శ్రీగిరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న దాత

ఉప్పలగుప్తం: గుడ్ సీడ్ అధినేత కుంచే రమణారావు సహకారంతో అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర సరకులను అందజేశారు. వానపల్లిపాలెం పంచాయతీ పరిధి బీవీఆర్ నగర్‌లో ఇటీవల జొన్నాడ వీరాస్వామి ఇల్లు దగ్ధం కాగా, ఆ కుటుంబానికి శుక్రవారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరమట రాజేష్, ముత్తాబత్తుల వజ్రం, కుంచే అర్జున్, దోనిపాటి రాంబాబు, రమేష్, సాదే శ్రీఆంజనేయులు, సీతాల జానకీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు అజరామరం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన కేసం వెంకట నరసమ్మ (80) శుక్రవారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు గోనెమడతల కృష్ణ, ప్రసాద్, పోతుల అనిల్‌లను సామాజిక కార్యకర్త లయన్ ధూళిపూడి వెంకటరమణ సంప్రదించి నరసమ్మ కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. నేత్రదానానికి సహకరించిన ఆ కుటుంబాన్ని వుంగరాల కృష్ణ, ధూళిపూడి ఆదినారాయణ, గంగిరెడ్డి వెంకటేశ్వరరావు, భీమేష్ తదితరులు అభినందించారు.